# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 12-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ మహనీయుల జీవిత చరిత్రలను చదవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ యువతకు పిలుపునిచ్చారు.
- ❖ "వందేమాతరం" స్ఫూర్తి భారత స్వాతంత్ర్య పోరాటానికి ప్రేరణనిచ్చిందని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు.
- ❖ విదేశీ విరాళాల నియంత్రణ (సవరణ) FCRA బిల్లును లోక్ సభ సంయుక్త పార్లమెంటరీ కమిటీ (JPC)కి పంపించింది.
- ❖ విద్యార్థుల సమస్యతో సహా ఏ అంశంపైనైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

సోషల్ మీడియా రీల్స్, ఇన్‌ఫ్లుయెన్సర్ల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత కాలంలో జీవితంలో షార్ట్‌కట్స్‌ను అనుసరించకుండా.. తాము అభిమానించే వ్యక్తుల జీవిత చరిత్రలను చదవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యువతకు సూచించారు. 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు దేశానికి అంకితభావం కలిగిన యువత నిరంతరం అవసరమని అన్నారు. పూర్వ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ జీవిత చరిత్ర 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ : మై లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తకాన్ని ప్రధానమంత్రి న్యూఢిల్లీలో ఈరోజు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రామ్‌నాథ్ కోవింద్ జీవిత ప్రస్థానాన్ని ఆయన రాసిన మాటల్లోనే తెలుసుకోవాలని యువతకు సూచించారు. దేశ నిర్మాణం కోసం కలలు కన్న మహాత్మా గాంధీ, బాబాసాహెబ్ అంబేద్కర్, జ్యోతిబా ఫూలే, సావిత్రిబాయి ఫూలే వంటి మహనీయుల జీవిత చరిత్రలను చదవాలని ప్రధానమంత్రి ఈ సందర్భంగా యువతకు పిలుపునిచ్చారు.

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

'వందే మాతరం' స్ఫూర్తి భారత స్వాతంత్ర్య పోరాటానికి ప్రేరణనిచ్చిందని, నేటికీ దేశ ఐక్యతను అది మరింత బలోపేతం చేస్తోందని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూ ఢిల్లీలో ఈరోజు నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ'లో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంటోందని, సేవా స్ఫూర్తిని మరింత బలోపేతం చేసేందుకు ఇది దోహదపడుతోందని పేర్కొన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో ప్రజలు చురుగ్గా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

విదేశీ విరాళాల నియంత్రణ (సవరణ) బిల్లు FCRA-2026ను మరింత పరిశీలన కోసం ఉభయ సభల సంయుక్త పార్లమెంటరీ కమిటీ (JPC)కి లోక్ సభ పంపించింది. విదేశీ విరాళాల వినియోగాన్ని మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించడమే బిల్లు ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం తెలిపింది. ఈ బిల్లును విస్తృతంగా సంప్రదింపులు జరిపేందుకు ఉభయ సభలకు చెందిన సభ్యులతో కూడిన సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ప్రతిపాదించారు. ఈ కమిటీలో లోక్‌సభ నుంచి స్పీకర్ నామినేట్ చేసే 21 మంది సభ్యులు, రాజ్యసభ నుంచి ఛైర్మన్ నామినేట్ చేసే 10 మంది సభ్యులు ఉంటారని ఆయన తెలిపారు. రాబోయే శీతాకాల సమావేశాల తొలి వారంలోని చివరి రోజులోగా కమిటీ తన నివేదికను లోక్‌సభకు సమర్పిస్తుందని నిత్యానంద్ రాయ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (NCDC) సవరణ బిల్లు–2026ను రాజ్యసభ ఆమోదించింది. ఇప్పటికే ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. కేంద్ర సహకార శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ బిల్లును ఈరోజు రాజ్యసభలో ప్రవేశపెట్టారు. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ చట్టం-1962ను సవరించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. సవరించిన చట్టం ప్రకారం.. NCDC పారిశ్రామిక వస్తువుల రంగంలో కూడా తన కార్యకలాపాలను చేపట్టేందుకు వీలు కలుగుతుంది. సహకార అభివృద్ధిలో నిమగ్నమైన ఏ సంస్థకైనా NCDC ద్వారా నిధులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తుంది. బిల్లుపై జరిగిన చర్చలో మురళీధర్ మొహోల్ మాట్లాడుతూ.. ఈ బిల్లు ద్వారా దేశవ్యాప్తంగా కోట్లాది మంది రైతుల సంక్షేమం, ఆర్థిక సాధికారత మరింత బలోపేతమవుతాయని అన్నారు. దేశంలో సహకార రంగం వ్యవస్థీకృతంగా అభివృద్ధి చెందేందుకు ఆర్థిక సహాయం అందించాలనే లక్ష్యంతో NCDC ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

విద్యార్థుల సమస్యతో సహా ఏ అంశంపైనైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. పార్లమెంట్ ప్రాంగణంలో ఆయన ఈరోజు విలేకరులతో మాట్లాడుతూ.. సభ్యులు లేవనెత్తే అన్ని ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వం దాచాల్సినది ఏమీ లేదని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు సభా కార్యకలాపాలను సాగనివ్వడం లేదని ఆయన ఆరోపించారు. ఇంత తీవ్రమైన అంశంపై పార్లమెంటరీ నిబంధనల ప్రకారం చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు.

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ అధ్యక్షతన "బ్రిక్స్ సముద్ర, ధ్రువ విజ్ఞాన శాస్త్రం, సాంకేతికత వర్కింగ్ గ్రూప్ 8వ సమావేశం" గోవాలో ఈరోజు ప్రారంభమైంది. భూ విజ్ఞాన శాస్త్రాల మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ సెంటర్ ఫర్ పోలార్ అండ్ ఓషన్ రీసెర్చ్ ఈ మూడు రోజుల సమావేశానికి ఆతిథ్యం ఇస్తోంది. సముద్రాలు, ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రాంతాల్లో పరిశోధనలను మరింత ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రైల్వే రిజర్వ్‌డ్ టికెట్ల బుకింగ్‌లో ప్రస్తుతం దాదాపు 89 శాతం టికెట్లు ఆన్‌లైన్ లోనే అవుతున్నాయని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. 2013-14లో ఆన్‌లైన్ ద్వారా బుక్ అయిన రిజర్వ్‌డ్ టికెట్ల వాటా సుమారు 49 శాతంగా ఉండేదని ఆయన పేర్కొన్నారు. లోక్‌సభలో ఈరోజు ఒక ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానమిస్తూ... రిజర్వ్‌డ్, అన్‌రిజర్వ్‌డ్ టికెట్ల కొనుగోలులో డిజిటల్ విధానాన్ని మరింత విస్తరించే లక్ష్యంతో రైల్వే శాఖ 'రైల్‌వన్' యాప్‌ను ప్రారంభించిందని తెలిపారు. ఈ యాప్ ద్వారా ప్రయాణికులు తమ మొబైల్ ఫోన్ నుంచే రిజర్వ్‌డ్ తో పాటు అన్‌రిజర్వ్‌డ్ టికెట్లను కూడా బుక్ చేసుకునే సౌకర్యం కల్పించినట్లు మంత్రి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ముంబైలోని ఘాట్‌కోపర్ ప్రాంతంలో ఈరోజు తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడి ఓ భవనంపై పడిన ఘటనలో ఆరుగురు మృతి చెందగా.. మరో నలుగురు గాయపడ్డారు. బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (BMC) తెలిపిన వివరాల ప్రకారం.. ఘాట్‌కోపర్‌లోని చిరాగ్ నగర్ ప్రాంతంలోని గౌషియా చాల్‌లో తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కొండ ప్రాంతంలోని కొంత భాగం కూలి చాల్ భవనంపై పడటంతో శిథిలాలు రెండు నుంచి మూడు ఇళ్లపై పడినట్లు అధికారులు తెలిపారు. ముంబై అగ్నిమాపక సిబ్బంది, ముంబై పోలీసులు, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (NDRF) సిబ్బంది సంయుక్తంగా సహాయక చర్యలు చేపడుతున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

నైజీరియాలోని లాగోస్ నగరం వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ లో మూడో రోజు భారత ఫెన్సింగ్ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. వివిధ సీనియర్ వ్యక్తిగత విభాగాల్లో భారత్ మూడు స్వర్ణ పతకాలు, ఒక రజతం, ఒక కాంస్య పతకం సాధించింది.  దీంతో భారత్ మొత్తం పతకాల సంఖ్య 29కి చేరింది. ఇందులో 8 స్వర్ణాలు, 7 రజతాలు, 14 కాంస్య పతకాలు ఉన్నాయి. సీనియర్ మహిళల ఫాయిల్ విభాగంలో అద్భుతంగా రాణించిన కనకలక్ష్మి స్వర్ణ పతకం సాధించగా, సహచర క్రీడాకారిణి జోయిస్ అశిత రజత పతకం గెలుచుకుంది. దీంతో ఈ విభాగంలో భారత్ తొలి రెండు స్థానాలను దక్కించుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ వ్యాపారులు న్యాయబద్ధమైన వాణిజ్య విధానాలను అనుసరించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. అదే విధంగా పునర్వినియోగం, రీసైక్లింగ్‌ను ప్రోత్సహించాలని, సర్క్యులర్ ఎకానమీని అభివృద్ధి చేయాలన్నారు. భారతీయ ఉత్పత్తులు, సేవలను అంతర్జాతీయ మార్కెట్లకు తీసుకెళ్లే క్రమంలో ఈ విధానాలను పాటించాలని ఆయన సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =